Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం, జులై 14, 2026




## ఇరిగేషన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

### రైతుల భవిష్యత్తును మార్చే సాగునీటి ప్రాజెక్ట్

**టీ మీడియా,జూలై13, అశ్వాపురం:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మాణంలో ఉన్న మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, కాలువల నిర్మాణం, పంప్ హౌస్‌లు, సాగునీటి పంపిణీ వ్యవస్థ, నాణ్యత ప్రమాణాలు, భూసేకరణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీరు సకాలంలో అందించాలంటే పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్ట్, మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. గోదావరి జలాలను ఎత్తిపోసి సాగుకు అందించడం ద్వారా వేలాది రైతు కుటుంబాలకు శాశ్వత సాగునీటి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందని, పెండింగ్‌లో ఉన్న అనుమతులు, భూసేకరణ, అటవీ అనుమతులు తదితర అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. . సీతారామ ప్రాజెక్ట్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగంలో స్వర్ణయుగానికి నాంది పలుకుతుంది. ప్రతి రైతు పొలానికి గోదావరి జలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది” అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ మహేశ్వర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (తెల్లం వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వై. రాంబాబు, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు సందీప్, రమేష్, వెంకటేష్ , యూత్ కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి నరేష్, తదితర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి వినతికి నిర్దేశిత గడువులో పరిష్కారం

### జిల్లా కలెక్టర్ అంకిత్



**టీ మీడియా,జూలై13, పాల్వంచ :**సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రతతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, నిర్దేశిత గడువులో పరిష్కారం చూపాలని ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని కేవలం నమోదు చేయడమే కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని తెలిపారు.

**స్వీకరించిన కొన్ని వినతులు**

చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన ఊరబెట్టి జయ తన మామ ఊరబెట్టి భిక్షమయ్య 2024లో మరణించారని, ఆయన పేరుపై ఉన్న రెండు ఎకరాల భూమిని తన పేరుపై పట్టా మంజూరు చేయాలని ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, భూ సర్వే పూర్తయినా ఇప్పటివరకు పట్టా మంజూరు కాలేదని తెలిపారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల

## ‘ఎస్పీ శబరీష్’ మార్క్ పోలీసింగ్

### ”మన ఊరు - మన బాధ్యత ఉద్యమం

**టీ మీడియా, జూలై 13,కురవి:**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ ఆలోచనతో, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన “మన ఊరు - మన బాధ్యత” కార్యక్రమం జిల్లాలో సరికొత్త సామాజిక విప్లవానికి నాంది పలుకుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి భద్రత, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనే ఏకైక లక్ష్యంగా సాగుతున్న ఈ వినూత్న ప్రచారానికి గ్రామ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. చట్టాన్ని అమలు చేయడమే కాకుండా, ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంచుతూ ఎస్పీ చూపిస్తున్న చొరవతో గ్రామాల్లో సరికొత్త చైతన్యం వెల్లివిరుస్తోంది.

**100కు పైగా గ్రామాల్లో విజయవంతం**

జిల్లావ్యాప్తంగా రెండు విడతలుగా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. మే నెలలో తొలి విడతగా 36 గ్రామ పంచాయతీలు, 13 వార్డుల్లో, జూలై నెలలో రెండో విడతగా 54 గ్రామ పంచాయతీలు, 4 వార్డుల్లో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. మొత్తంగా 100కు పైగా గ్రామ పంచాయతీలు, వార్డుల్లో ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉద్యమం విజయవంతంగా ముందుకు సాగుతోంది.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన**

స్థానిక సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, గ్రామ కమిటీల సహకారంతో ఆయా పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్ల (రాక్షీ) ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించారు. క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తూనే.. రహదారి భద్రత, మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలు, భద్రతలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో లోతైన అవగాహన కల్పించారు.

**భారీ హెల్మెట్ ర్యాలీ**

గార్ల మండలం గోపాలపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వయంగా భారీ హెల్మెట్ బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ భద్రతలో మరియు చట్టాల అమలులో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదాల్లో అమూల్యమైన ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రతి గ్రామంలో “హెల్మెట్ లేకపోతే ప్రవేశం లేదు” అనే నిబంధనను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. దీనికి గ్రామాల నుంచి అపూర్వ మద్దతు లభిస్తోంది.





**గంజాయి రహిత గ్రామమే లక్ష్యం**

?యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోకూడదని, గ్రామాలను పూర్తిగా గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఎస్పీ సూచించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ‘ప్రతిజ్ఞ గోడ’ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ ఊరిని వ్యసన రహితంగా మారుస్తామని యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గోడపై సంతకాలు చేసి తమ సంకల్పాన్ని చాటారు.



## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి

**టీ మీడియా, జూలై 13,కొత్తగూడెం :** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కోల్ మైన్స్ కాంటాక్ట్ మజ్దూర్ సంగ్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనుప నూరి నాగేశ్వరరావు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం కొత్తగూడెం క్లబ్ లో జరిగిన సింగరేణి భరోసా యాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రికి ఆయన వినతి పత్రం సమర్పించారు. సింగరేణిలో సుమారు 30,000 మంది కాంటాక్ట్ కార్మికులు వివిధ డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్నట్లు తెలిపారు. కాంటాక్ట్ కార్మికులకు చాలా తక్కువ వేతనాలు ఇవ్వడం వల్ల చాలీచాలని జీతాలతో భార్య పిల్లలను పోషించుకోవడం, తల్లిదండ్రులను చూసుకోవడం చాలా ఇబ్బందిగా ఉందని, పిల్లల చదువులకు.. తల్లిదండ్రుల అనారోగ్య సమస్యల వైద్య ఖర్చులకు జీతాలు సరిపోక అప్పుల పాలు అవుతున్నట్లు వెల్లడించారు. సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలు చేస్తున్న ఐ పవర్ కమిటీ వేతనాలను తెలంగాణ రాష్ట్రం విడుదల చేసిన జీవో నంబర్ 22 గెజిట్ చేసి అమలు చేయాలని కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన సెలవులను కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, గుర్రం సృజన్, పిట్టల రాజశేఖర్ ఉన్నారు.

## రైల్వే సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం

**టీ మీడియా,జూలై13, మణుగూరు** :ప్రజల తరపున చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారికి నేడు మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో సమర్పించాము.

**వినతిపత్రంలో ప్రధానంగా ఈ డిమాండ్లు**

12745/12746 సికింద్రాబాద్మణుగూరు ఎక్స్‌ప్రెస్‌లో2స్లీపర్కోచ్‌లు, 1జనరల్కోచ్‌ను పునరుద్ధరించాలి.57657/57658మణుగూరుకాజీపేట్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలి.17033/17034 సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను మణుగూరు వరకు పొడిగించాలి.

67215/67216 విజయవాడ--భద్రాచలం రోడ్ ను మణుగూరు వరకు విస్తరించాలి.మణుగూరుకు ఉదయం రైలుసౌకర్యాన్నికల్పించాలి.మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు సింగరేణి బొగ్గు ప్రాంత ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన అమలు చేయాలని గౌరవ మంత్రిని కోరాము.



## మాంటిసోరి స్కూల్లో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

**టీ మీడియా,జూలై13,సింగరేణి(కారేపల్లి):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి మండల కేంద్రంలోని కారేపల్లి మాంటిసోరి స్కూల్లో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) పంపిణీ చేశారు.పాఠశాల ప్రిన్సిపల్ మినీ జోజో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మినీ జోజో మాట్లాడుతూ,నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు వారి శారీరక ఎదుగుదల,రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఈ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని,తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రత,చేతులు శుభ్రంగా కడుక్కోవడం,పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి మంచి అలవాట్లను పిల్లలకు అలవర్చాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలు లేకుండా ఆర్టీసీ విలీన ప్రక్రియ జరగాలి

**-ఐక్య పోరాటాల వేదిక**

**ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలపరచండి**

**-గడ్డం లింగమూర్తి,**

**తుమ్మ విష్ణువర్ధన్ ల పిలుపు**

**టీ మీడియా, జూలై 13,ఖమ్మం:** తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ అన్ని సమస్యలు పరిష్కరించుకున్న తర్వాత ఏ విధమైన సమస్యలు లేకుండా జరగాలని, క్షేత్రస్థాయిలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను సేకరిస్తూ పరిష్కరించాలంటూ ఆర్టీసీ యాజమాన్యానికి,ప్రభుత్వానికి నివేదికలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటాల వేదిక ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలపరచడం ద్వారా ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి,సిఐటియు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్ లు పిలుపునిచ్చారు.సోమవారం ఖమ్మం లోని కొండబోలు వెంకయ్యచౌదరి మీటింగ్ హాల్ లో గడ్డం వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటైన ఖమ్మం డిపో విస్తృత స్థాయి సమావేశంలో గడ్డం లింగమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.డిపో కమిటీ సహాయ కార్యదర్శి జి.బాబు అతిథులను వేదిక పైకి ఆహ్వానించగా,ఉపాధ్యక్షులు గుర్రం రామారావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రతినిధులు అందరూ మౌనం పాటించి నివాళు లర్పించారు.డిపో కార్యదర్శి రోశయ్య కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు.ప్రతినిధులు అందరూ చర్చల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లింగమూర్తి ప్రసంగిస్తూ తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని త్వరలోనే ఆర్టీసీలో ఎన్నికల ప్రకటన విలువడనుందని తెలిపారు అందుకని గత కెసిఆర్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీలో సంఘాల పట్ల ఆంక్షలు విధించినప్పటినుండి అనేక కార్మిక కార్మిక సమస్యల పట్ల ఎస్ డబ్ల్యూ ఎఫ్ గా స్పందించామని కరపత్రాలు పంచటం,డిమాండ్ బ్యాడ్జీలు ధరించడం,సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందించడం,పెన్షన్ స్కీము,ఆర్టీసిలో విద్యుత్ బస్సుల పథకం,ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వంలో విలీనంపై అధ్యయనం వంటి కార్యక్రమాలతో నిత్యం కార్మికులతోనే ఉన్నా మన్నారు.ఖమ్మం రీజియన్ అధ్యక్ష,కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ లు ప్రసంగిస్తూ ఖమ్మం రీజయన్లో స్థానిక గుర్తింపు సంఘం గా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మిక సమస్యల పరిష్కారానికి గుర్తింపును ఆయుధంగా



ఉపయోగించిందని తెలిపారు.ఎస్ డబ్ల్యూఎఫ్ గుర్తింపు కాలంలో ఖమ్మం రీజియన్ లో కార్మికుల పని పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు.గుర్తింపు సంఘంగా ఉంటూనే టిమ్స్,సింగల్ క్రూ,అద్దె బస్సులు,అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు.ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలోపేతం చేయడం కోసం ఖమ్మం రీజియన్ ప్రచార కార్యదర్శి తోకల బాబు ప్రసంగించిన ఈ కార్యక్రమంలో రీజనల్ ఉపాధ్యక్షులు కుడుదుల వెంకన్న,రీజియన్ సహాయ కారదర్శి వి.రమేష్,కోశాధికారి పగిళ్ళపల్లి నరసింహారావు డిపో కమిటీ ప్రచార కార్యదర్శి చెరుకూరి రామకృష్ణ(ఆర్కే నాయుడు) పాల్గొన్నారు.

# జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో 16 పతకాలు

**-అభినందించిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**

**టిమీడియా,జులై13, కురవి:**మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖకు జోనల్ పోలీస్ డ్యూటీ మీట్--2026లో విశేష గుర్తింపు లభించింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మామ్నూర్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన భద్రాద్రి జోన్--క్ష్మీఎ పోలీస్ డ్యూటీ మీట్‌లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహబూబాబాద్ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది మొత్తం 16 పతకాలను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా పతక విజేతలు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజేతలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ, జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చినందుకు ప్రశంసలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మహబూబాబాద్ జిల్లా తరఫున ఓవరాల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన డీఎస్పీ శ్రీనివాస్‌ను, ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ కోచ్‌గా సేవలందించిన అంజయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

**స్వర్ణ పతక విజేతలు:**

ఎస్ఐ సి.హెచ్. అరుణ్ కుమార్ -- ప్రోగ్రామింగ్ ఎబిలిటీ విభాగంలోబి. రామయ్య (పీసీ-1094) -- బాంబ్ స్క్వాడ్ యాంటీ సబోటేజ్ చెక్ (రూమ్ సెర్చ్)కె. ఈశ్వర్ -- రుద్ర (డాగ్ స్క్వాడ్) -- ఎక్స్‌ప్లోజివ్ విభాగంలోసి.హెచ్. రాకేష్ -- లూసీ (డాగ్ స్క్వాడ్) -- ట్రాకర్ విభాగంలో

రజత పతక విజేతలు:కె. మధు -- పోలీస్ పోర్ట్రెయిట్పి. సుమన్ -- కంప్యూటర్ అవేర్‌నెస్ఎండీ. అబ్దుల్ ఖదీర్ -- ఆఫీస్ ఆటోమేషన్

ఎన్. చిరంజీవి, బి. సాయి కుమార్ -- పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్కె. కుశల్ కుమార్ -- పోలీస్ వీడియోగ్రఫీజి. అశోక్ -- బాంబ్ స్క్వాడ్ యాంటీ సబోటేజ్ చెక్ (రూమ్ సెర్చ్)కాంస్య పతక విజేతలు:ఎస్. విఠల్ -- లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్బి. శంకర్ నాయక్ -- క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ లాఎండీ. అబ్దుల్ ఖదీర్ -- ప్రోగ్రామింగ్ ఎబిలిటీబి.



రామయ్య -- బాంబ్ స్క్వాడ్ యాంటీ సబోటేజ్ చెక్ (వెహికల్ సెర్చ్)ఎ. మహేష్ -- బాంబ్ స్క్వాడ్ యాంటీ సబోటేజ్ చెక్ (గ్రౌండ్ సెర్చ్)ఎ. హరీష్ కుమార్ -- చార్లీ (డాగ్ స్క్వాడ్) -- ట్రాకర్ విభాగంలో

జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో మహబూబాబాద్ జిల్లా పోలీసు సిబ్బంది సాధించిన ఈ విజయాలు జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాయని ఎస్పీ డాక్టర్ శబరీష్ పేర్కొన్నారు. విజేతలందరికీ ఆయన మరోసారి అభినందనలు తెలియజేస్తూ, సేవా రంగంలో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# తిమ్మరావుపేట--ఇల్లందు డబుల్ రోడ్డుకు రూ.76 కోట్ల ప్రతిపాదనలు

**ప్రజలతో మమేకమైన నాయకుడు గుమ్మడి నర్సయ్య**

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**టీ మీడియా,జూలై13,సింగరేణి(కారేపల్లి):** తిమ్మరావుపేట నుంచి చీమలపాడు మీదుగా ఇల్లందు ఆర్అండ్‌బీ రోడ్డు వరకు రూ.76 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపినట్లు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు.సోమవారం కారేపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే టేకులగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.తాను ఇల్లందు హాస్టల్‌లో చదువుకున్న రోజులను స్మరించుకుంటూ,ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడు గుమ్మడి నర్సయ్య అని కొనియాడారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ తొడితలగూడెం నుంచి నర్సింహస్వామి దేవాలయం వరకు బీటీ రోడ్డు,వేపలగడ్డ నుంచి తొడితలగూడెం,వేపలగడ్డ తండా నుంచి తొడితలగూడెం వరకు రహదారులు మంజూరు చేయాలని,అలాగే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్,ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.వెంటనే పంచాయతీరాజ్ అధికారులను పిలిచి సంబంధిత పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు."మీ ఆశీర్వాదంతో ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని పేర్కొన్నారు.అంతకుముందు మొట్లగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సర్పంచ్



పొడుగు పెంటయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు,సూరపు రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,సర్పంచులు గుమ్మడి సందీప్,ఉపసర్పంచ్ బిక్కసాని భాస్కర్‌రావు,తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు,ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మైనారిటీ గురుకులానికి 10 ఫ్యాన్ల విరాళం

**టీ మీడియా,జూలై13,సింగరేణి (కారేపల్లి):**కారేపల్లిలో నిర్వహిస్తున్న వైరా మైనారిటీ గురుకుల విద్యాలయానికి గురుకుల అడ్మిషన్ కమిటీ సభ్యులు షేక్ గౌసుద్దీన్ సోమవారం 10 సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా అందజేశారు.గురుకులంలో నిర్వహించిన పేరెంట్స్--టీచర్స్ సమావేశంలో గౌసుద్దీన్ ఈ ఫ్యాన్లను విద్యాలయ ప్రిన్సిపాల్ డీ.సావిత్రికి అందజేశారు.విద్యాలయ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా ప్రిన్సిపాల్ ఆయనను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా షేక్ గౌసుద్దీన్ మాట్లాడుతూ,గురుకులంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నందున తన కుమార్తె మాహియాను ఈ విద్యాలయంలో చేర్పించినట్లు తెలిపారు.విద్యార్థుల సౌకర్యార్థం 10 ఫ్యాన్లను అందజేయడం ఆనందంగా ఉందని,భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ పెద్దలు ఖలీలుల్లా ఖాన్,విద్యాలయ ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## సర్‌ఎన్యుమరేషన్ లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

**-కుటుంబ సభ్యుల వివరాలు అందజేత**

**టీ మీడియా, జులై 13,ఖమ్మం:**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బి ఎల్ ఓలు ఇంటింటికి తిరిగి అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి వారికి అప్పగించి, రసీదు పొందాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచించారు. సోమవారం ఖమ్మం బుర్హాన్ పురంలోని తన క్యాంపు కార్యాలయంలో వద్దిరాజు తమ కుటుంబ సభ్యుల సర్ ఎన్యూమరేషన్ ఫారాలను స్వయంగా నింపి సంబంధిత బి ఎల్ ఓ మాగి సావిత్రి కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ గురించి బీఎల్ఓ అడిగి తెలుసుకున్నారు. డూప్లికేట్ ఓట్లు, అడ్రస్ దొరకని ఓటర్ల గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని తెలుసుకున్నారు. ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ను సద్వినియోగం చేసుకుని, తమ వివరాలతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలు అందజేయాలని ఎంపీ రవిచంద్ర కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో లేదా వివరాల నమోదులో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే, స్థానికనాయకులు, బూత్ లెవల్ ఏజెంట్ లు అందుబాటులో ఉండి సహకారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**టీ మీడియా,జూలై13,సింగరేణి(కారేపల్లి):**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కారేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్)ను సోమవారం సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ),మండల వైద్యాధికారి డాక్టర్ బి. సురేష్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ టోనీ,డాక్టర్ సురేష్ మాట్లాడుతూ చిన్నారుల్లో నులిపురుగుల సమస్య కారణంగా ఆకలి మందగించడం,శారీరక ఎదుగుదల దెబ్బతినడం,రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.అందుకే ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రత,చేతులు శుభ్రంగా కడుక్కోవడం,గోర్లు చిన్నగా ఉంచుకోవడం,పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ఆరోగ్యవంతమైన బాలలే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,ఆరోగ్య సిబ్బంది లలిత,అనిత,దేవ కరుణ,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గిన్నీస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించిన యస్.బి.ఐ.టి. విద్యార్థి

**టీ మీడియా, జులై 13,ఖమ్మం:**ప్రపంచ వ్యాప్తంగా ఘనతను సాధించిన వ్యక్తులు, విశేషాలను ప్రచురించే ప్రఖ్యాత పుస్తకం గిన్నీస్ వరల్డ్ రికార్డులో తమ కళాశాల ఈ.ఈ.ఈ., తృతీయ సంవత్సర విద్యార్థి గడ్డం భూపతి స్థానం సాధించినట్లు యస్.బి.ఐ.టి. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల హైదరాబాదులో విషన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, జె.ఆర్. ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ సంయుక్తంగా 1,212 సభ్యులతో కూడిన అతి పెద్ద ప్రదర్శన లో భాగంగా ఈ ఘనతను సాధించినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. సుమారు 40 నిమిషాల నిడివిగల కటాస్ ప్రదర్శనను కేవలం 20 నిమిషాలలోనే తమ విద్యార్థి భూపతి ప్రదర్శించి పూర్తి చేసినందుకు గానుప్రముఖుల ప్రశంసలను అందుకున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. భూపతి తండ్రి గడ్డం ఉపేందర్ కరాటే మాస్టర్ అని, పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యమేనని తమ విద్యార్థి భూపతి నిరూపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఘనతను సాధించిన విద్యార్థి భూపతిని కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, ఈ.ఈ.ఈ. విభాగఅధిపతి డా॥ టి. చరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.




## చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన

**ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ**

**టీమీడియా, జూలై 13,కురవి:**విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన, మహిళల భద్రత, సైబర్ సెక్యూరిటీ, రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించే లక్ష్యంతో కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. పి. శబరిష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కురవి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, భరోసా కేంద్రం ఎస్ఐ కుమారి దీపికా రెడ్డి, షీ టీం సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువులపై దృష్టి సారించాలని, చెడు స్నేహాలు, మత్తు పదార్థాలు, డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని వివరించారు.అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ షీ టీం నంబర్ 8712656935, అత్యవసర సేవల నంబర్లు 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, మహిళల హెల్ప్‌లైన్ 181, 1091 గురించి విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. లాలు, అధ్యాపక సిబ్బంది, సుమారు 450 మంది విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచటమే లక్ష్యం

**-మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్**

**టి మీడియా ,జూలై 13,ఖమ్మం రూరల్,** : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తని అనిత, కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సోమవారం చిన్న తండా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాఠశాలల ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల నమోదు, మౌలిక వసతులు, బోధన ప్రమాణాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా కృషి చేయాలని సూచించారు.ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, నైపుణ్యాధారిత బోధన, డిజిటల్ విద్య వంటి సౌకర్యాలను ప్రజలకు వివరించాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడం, పాఠశాలల పరిశుభ్రత, పచ్చదనం, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించే వినూత్న కార్యక్రమాలను చేపట్టాలని, ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బానోత్ భాస్కర్, బుర్ర మహేష్, బానోత్ నాగేంద్రప్రసాద్, బానోత్ దివ్య, కడవ నవీన్, హెచ్ఎం రామ చంద్రు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి వినతికి నిర్దేశిత

కోసం చుంచుపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం జెండాల తండాకు చెందిన బానోత్ రాంబాబు తాను దివ్యాంగుడినని, ప్రస్తుతం రేకుల ఇంటిలో నివసిస్తున్నానని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తు చేసుకున్నానని, రెండో విడతలో తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం అప్పిరెడ్డిగూడెంకు చెందిన గిరిజన రైతు మోకాళ్ల నరసయ్య అనేక సంవత్సరాలుగా పోడు భూమిలో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నానని, ఆ భూమే తమ కుటుంబానికి జీవనాధారమని, పోడు పట్టా మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు.బూర్గంపాడు మండలం మోతెపట్టి నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామస్థులు గత 30 సంవత్సరాలుగా గ్రామంలో నివసిస్తున్నప్పటికీ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రెండు కిలోమీటర్ల దూరంలోని కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని, తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.ఇల్లందు మండలం చల్లసముద్రం గ్రామానికి చెందిన గన్నెబోయిన వెంకటరమణ తాను 90 శాతం దివ్యాంగుడినని, శారీరక వైకల్యం కారణంగా స్థిరమైన ఉపాధి లేక కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా కంప్యూటర్ రంగంలో అనుభవం ఉన్నందున ప్రభుత్వ కార్యాలయంలో లేదా ఏదైనా శాఖలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.